# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- యాక్సియం-4 మిషన్ లో భాగంగా నలుగురు వ్యోమగాములను తీసుకెళ్లిన స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ఈరోజు సాయంత్రం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)తో సజావుగా డాకింగ్ చేయబడింది.
- ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకు తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.
- సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై ఆపరేషన్ చక్ర-V పేరిట సిబిఐ ఈరోజు దేశ వ్యాప్తంగా దాడులు చేపట్టింది.
- మాదకద్రవ్యాలు రవాణా చేసేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- ఒడిస్సా లోని పూరీ నగరంలో జగన్నాధుని రధయాత్ర భక్త జన సందోహం మధ్య రేపు ఘనంగా ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

యాక్సియం-4 మిషన్ లో భాగంగా శుభాన్షు శుక్లాతో సహా నలుగురు వ్యోమగాములను తీసుకెళ్లిన స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ఈరోజు సాయంత్రం 4 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)తో సజావుగా డాక్ చేయబడటంతో ఈ ప్రయోగం విజయవంతమయ్యింది. దీనితో 41 సంవత్సరాల తర్వాత అంతరిక్షంలోకి ఒక వ్యోమగామిని పంపించి భారత్ చరిత్ర సృష్టించింది. ఈ చారిత్రాత్మక మిషన్ నలుగురు వ్యోమగాములను లోఎర్త్ ఆర్బిట్ లో 14 రోజుల శాస్త్రీయ పరిశోధనల కోసం ISSకి తీసుకువెళుతుంది. అంతకముందు భూకక్ష్యలో తిరుగుతున్న సమయంలో శుభాన్షు శుక్లా అంతరిక్షం నుంచి లైవ్ కాల్‌లో మాట్లాడుతూ.. అంతరిక్ష ప్రయాణం చాలా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

యాక్సియం-4 మిషన్ కేవలం శాస్త్రీయ ఘనత మాత్రమే కాదని ప్రపంచ సాంకేతిక శక్తి కేంద్రంగా భారతదేశ పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇది అంతరిక్ష ఆవిష్కరణలకు నాయకత్వం వహించడానికి దోహదపడే దేశ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందన్నారు. ఈ మిషన్ విజయం సాధించడంతో ఆయన వ్యోమగాముల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై ఆపరేషన్ చక్ర-V పేరిట సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (CBI) దాడులు చేపట్టింది. దేశ వ్యాప్తంగా 42 ప్రదేశాల్లో సీబీఐ ఈరోజు దాడులు నిర్వహించింది. మొత్తం 5 రాష్ట్రాల్లోని 42 ప్రదేశాల్లో దాడులు జరిపి 9 మందిని అరెస్ట్ చేసింది. యూపీఐ ద్వారా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారని సీబీఐ గుర్తించింది. దాదాపు 700 బ్యాంకు శాఖల పరిధిలోని 8.5 లక్షల మ్యూల్ ఖాతాల ద్వారా ఈ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో ఈ దాడులు చేపట్టామని సిబిఐ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ షాంఘై సహకార సంస్థ (SCO) సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సులో పాల్గొన్నారు. చైనాలోని క్వింగ్డావోలో జరిగిన ఈ సమావేశంలో చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం దీనిపై ఉమ్మడి ప్రకటన పత్రం సిద్ధం చేశారు. అయితే ఇందులో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. అంతకముందు ఈ సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకు తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిస్సాలోని పూరీ నగరంలో జగన్నాధుని రధయాత్ర భక్త జన సందోహం మధ్య రేపు ఘనంగా ప్రారంభం కానుంది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు ఒడిశా పోలీసు విభాగం సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేసింది. ఒడిశా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) వై.బీ. ఖురానియా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సంవత్సరం రధయాత్ర కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి, 10 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించామని వెల్లడించారు. ఇక పురాణాలపరంగా ఎంతో ప్రాశస్త్యం ఉన్న జగన్నాధుని రధయాత్రను ప్రతీ ఏటా ఆషాడ మాసం శుక్లపక్షం మొదలైన రెండవ రోజున నిర్వహించడం అనూచానంగా వస్తోంది. ఆధ్యాత్మిక నగరమైన పూరీకి దేశం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో రేపు తరలివస్తారు. లక్షలాది మంది భక్తులతో రధయాత్ర కడు వైభవంగా జరుగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాలు రవాణా చేసేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మాదకద్రవ్యాలు యువతకు అతిపెద్ద శాపమని అన్నారు. వాటికి బానిసలైన యువతను తిరిగి సాధారణ

జీవితానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. "అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా ఈరోజు సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన చేస్తూ.. "నషా ముక్త్ భారత్" కోసం కృషి చేస్తున్న యోధులందరికీ కేంద్రమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు  కొన్ని రకాల సమాచారాలను దాచిపెడితే మాత్రం వారి అభ్యర్ధనను ఖచ్చితంగా తిరస్కరిస్తామని అమెరికా దౌత్య కార్యాలయం వెల్లడించింది. ముఖ్యంగా సోషల్ మీడియా సమాచారం విషయంలో దీనిని కఠినంగా అమలు చేయనున్నామని పేర్కొంది. ఆ తర్వాత అప్లై చేసుకున్నా వీసా వచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. డీఎస్-160 వీసా అప్లికేషన్‌లో అభ్యర్ధులు గత ఐదేళ్ల నుంచి వినియోగిస్తున్న సోషల్ మీడియా యూజర్ నేమ్స్, హ్యాండిల్స్‌ను కచ్చితంగా వెల్లడించాల్సిందేనని ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ ధరఖాస్తులో ఉన్న సమాచారం పూర్తిగా వాస్తవం.. సరైనదే అని సంతకానికి ముందే అభ్యర్థి ధ్రువీకరించాల్సి ఉంటుందని తెలిపింది. ఇక ఈ విషయంపై భారత విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పందించారు. భారతీయ పౌరుల వీసా దరఖాస్తులన్నింటినీ మెరిట్ ఆధారంగా పరిగణించాలని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను గుర్తింపు పొందిన జాబితా నుంచి ఎన్నికల సంఘం తొలగిస్తోంది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన 6 సంవత్సరాల్లో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను గుర్తించి వాటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2 వేల 800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. కాగా ఒక రాజకీయ పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6 శాతం ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =